ప్రజాశక్తి

గురువారం 5 డిసెంబర్ 2024 8 పేజీలు

ప్రకాశం బాపట్ల





రేషన్ బియ్యం

'పక్కదారి'కి కారణమేంటి?

- ప్రధానంగా నాణ్యత లేకపోవడం వల్లే.!
- పాలకవర్గాల అండదండలతో డీలర్ల ఇష్టారాజ్యం
- అధికార పార్టీ నేతల జేబుల్లోకే ప్రధాన వాటా..

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

రేషన్ బియ్యంపై నిత్యం పెద్ద చర్చ. పార్టీల్లోనూ ఇదొక ఎజెండా. ఏ ప్రభుత్వం ఉన్నా ఇదే తంతు. రేషన్ బియ్యం వ్యాపారం పైనే ఇప్పుడు పెద్ద రభస జరుగుతోంది. కాకినాడ పోర్టును సందర్శించిన ఉపముఖ్యమంత్రి అక్కడ షిప్పుల్లో రేషన్ బియ్యం ఎగుమతి అవుతోందని హడావుడి ▶ 2లో



సిఎస్‌పురంలో నేలవాలిన వరి పంట

నేలవాలిన పంటలు

- ఎడతెరిపి లేని వర్షంతో నీటమునిగిన మినుము
- దెబ్బతిన్న శనగ, వరి
- నష్టాల్లో రైతులు

5లో ▲

ధాన్యం ధరకు కోత

- కొనుగోలు ధరలను తగ్గించిన ప్రైవేట్ వ్యాపారులు
- గతేడాది 75 కిలోల ధాన్యం రూ.1800..
- ఈ ఏడాది రూ.1400 మాత్రమే..
- అందుబాటులోకి రాని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు



రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లాలో ఖరీఫ్‌లో సాగు చేసిన వరి పైరుకు సంబంధించి కోతలు మొదలయ్యాయి. అయితే వరి కోతల సమయంలోనే అల్పపీడన ప్రభావంతో వర్షాలు పడుతున్న నేపథ్యంలో రైతులు తాము పంట నష్టపోతామన్న ఆందోళనలో దళారులకు తమ పంటలను తెగనమ్ముకుంటున్నారు. జిల్లాలో ప్రభుత్వం తరపున ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెబుతున్నప్పటికీ పలు కారణాలతో రైతులు మిల్లర్లకే ధాన్యం అమ్మకాలు జరుపుతున్నారు. ఇటీవల జిల్లాలోని వేమూరు నియోజకవర్గంలో పర్యటించిన రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ రైతులతో మాట్లాడారు. రైతులెవరూ ఆందోళన చెందవద్దని, వరి సాగు చేసిన రైతుల నుంచి ప్రతి గింజను ప్రభుత్వం కొంటుందన్నారు. ధాన్యం తేమ విషయంలో కూడా 25 శాతం వరకు సడలింపు ఇస్తున్నామని, ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లో రైతులకు నగదు జమ చేస్తామని చెప్పారు. ధాన్యం అమ్మకాల విషయంలో రైతులెవరూ తొందరపడకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా అమ్మకాలు జరపాలని చెప్పారు. కానీ వాస్తవ పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. ఈ ఖరీఫ్‌లో జిల్లాలో 150 రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు ఏర్పాట్లు చేశారు. జిల్లాలో ఖరీఫ్‌లో సుమారు 2.21లక్షల ఎకరాల్లో వరిసాగు చేశారు. ఐదు లక్షల మెట్రిక్ టన్నుల పైగా దిగుబడి వస్తుందని అంచనాగా ఉంది. ఈ ఖరీఫ్‌లో 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించారు. కేంద్రాల ద్వారా 75 కిలోల కామన్ రకం ధాన్యంకు రూ.1,725, గ్రేడ్ 'ఏ' రకం ధాన్యంకు రూ.1,740 చొప్పున మద్దతు ధరతో కొంటున్నారు. కాగా గతేడాది ప్రైవేట్ వ్యాపారులు 75 కిలోల ధాన్యాన్ని రూ.1800కు కొన్నారు. అప్పట్లో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర తక్కువగా ఉండడంతో రైతులు వారికే ధాన్యం అమ్మకాలు ▶ 2లో

ధాన్యం ధరకు కోత

(మొదటిపేజీ తరువాయి)

జరిపారు. కానీ ఈ ఏడాది మాత్రం ప్రైవేట్ వ్యాపారులు రూ.1400కు మాత్రమే ధాన్యం కొంటున్నారు. ధాన్యంకు తగిన మార్కెట్ లేని కారణంగా ఈ ఏడాది ప్రారంభంలోనే తగిన ధర లేదని చెబుతున్నారు. ప్రైవేట్ మార్కెట్ కంటే ప్రభుత్వమే ఎక్కువ ధర ఇస్తున్న క్రమంలో రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా తమ పంటను అమ్ముకోవడం లాభదాయకం. కానీ పలు సమస్యల కారణంగా రైతులు ప్రైవేట్ వ్యాపారులకే అమ్మకాలు జరుపుతున్నారు. పంట నీట మునిగితే నష్టపోతామన్న భయంతో ప్రైవేట్ వ్యాపారులకే ధాన్యం అమ్ముతున్నారు. దీంతో పాటు ప్రైవేట్ వ్యాపారులు ధాన్యం కొనుగోళ్ళను నేరుగా పొలంలోని కల్లాల నుంచే కొంటున్నారు. వారే వాహనాల ద్వారా ధాన్యం తరలించుకెళుతున్నారు. పంట నూర్పిడి యంత్రాలతో రైతులు వరి నూర్పిడిలు పూర్తి చేస్తున్నారు. మిల్లర్లు నేరుగా కల్లాలలోనే రైతుల నుంచి ధాన్యం కొంటున్నారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా అమ్మకాలు జరపడం లాభదాయకమే అయినప్పటికీ అమ్మకం విషయంలో పలు ఇబ్బందులు ఉన్నట్లు రైతులకు చెబుతున్నారు. వర్షాల కారణంగా ధాన్యం నూర్పిడి, ఆరబెట్టే అవకాశం లేకపోవడం, ధాన్యం రవాణాలో ఇబ్బందుల కారణంగా రైతులు తమ ధాన్యాన్ని ప్రైవేట్ వ్యాపారులకే అమ్మకాలు చేస్తున్నారు. జిల్లాలో ఇంకా పూర్తి స్థాయిలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు.

జిల్లాలోని వేమూరు నియోజకవర్గ పరిధిలో కొనుగోలు కేంద్రాలు పెట్టారు. రైసుమిల్లుల కేటాయింపులు, రవాణా వాహనాలను సిద్ధం చేయడం, సిబ్బంది నియామకాలు, రైతుల నుంచి త్వరితంగా ధాన్యం కొనుగోలు వ్యవహారాలు పర్యవేక్షణ పూర్తి స్థాయిలో సమకూరలేదు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్ళ సమయంలో జిల్లా పౌరసరఫరాల సంస్థకు పూర్తి స్థాయి అధికారి లేకుండా పోయారు. ఇన్‌ఛార్జీ పర్యవేక్షణలో సంస్థ ఉంది. కాగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఈ క్రాప్ చేసిన రైతులకు చెందిన ధాన్యం మాత్రమే కొంటున్నారు. తేమ శాతం విషయంలో కూడా 22 శాతం వరకు తీసుకుంటున్నారు. అయితే తేమ శాతం 17 మించితే 5 కిలోలు తరుగు కింద తీసుకుంటున్నారు. జిల్లాలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల విషయంలో ఉన్న సమస్యలను పరిష్కరించి రైతులకు మేలు జరిగే చర్యలు తీసుకోవలసి ఉంది.



పతకాలతో మెరిసిన టంగుటూరు భాష్యం విద్యార్థులు

బాష్యం విద్యార్థులకు బంగారు పతకాలు

ప్రజాశక్తి-టంగుటూరు

కాకినాడ డిఎస్‌పి స్టేడియంలో నవంబర్ 30 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు జరిగిన 5వ ఆంధ్రప్రదేశ్ ఫ్లోర్ కర్లింగ్ పోటీల్లో టంగుటూరు భాష్యం విద్యార్థులు 15 మంది పాల్గొన్నారు. వీరిలో జే చాతుర్య, కె ప్రీతిక, ఎన్ జుహీక, కె దీపిక బంగారు పతకాలు సాధించారు. పి సంజయ్ కుమార్, కె రుత్విక్, కె జవేరి, వి జశ్వంత్, ఆర్‌వి నూతన్‌రెడ్డి, వెండి పతకాలు సాధించగా, ఎం శ్రీవర్ధన్, జె మణికంఠ, ఎం ఆదర్శ్, టి నివేదిత్, ఎస్‌కె మస్తాన్‌వలి, పి రాహుల్ కాంస్య పతకాలు సాధించారు. ఫ్లోర్ కర్లింగ్ ఆటలో పాల్గొన్న 15 మంది విద్యార్థులు పతకాలు సాధించారు. పోటీల్లో పాల్గొని పతకాలు సాధించిన విద్యార్థులను భాష్యం విద్యాసంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ, ప్రకాశం జోన్ జెడ్ ఈఓ కృష్ణ గణేష్, ప్రిన్సిపాల్ ఖాదర్ బాషా, కోచ్ యెహెూషువ, తల్లిదండ్రులు అభినందించారు. పిల్లలు చదువుతో పాటు ఆటలలో కూడా రాణించడాన్ని చూసిన తల్లిదండ్రులు ఆనందించారు.

టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-కొమరోలు



సభ్వత్వం చేర్పించిన టిడిపి శ్రేణులతో హసీనా

కొమరోలు మండలం అనంత రాయునిపల్లి గ్రామంలో కొమరోలు మండలం మైనార్టీ నాయకురాలు షేక్ హసీనా ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వ కార్యక్రమాన్ని విజయ వంతంగా నిర్వహిస్తున్నారు. టిడిపి సభ్యత్వం వలన కలిగే ప్రయోజనాలను వివరించి సభ్వత్వం చేర్పిస్తున్నారు. సభ్వత్వ ప్రయోజనాలు ప్రమాదబీమా రూ.ఐదు లక్షలు, ఎన్టీఆర్ కాలేజీలో చదువుకొనేందుకు పిల్లలకు రాయితీ, పేద వర్గాలకు పెళ్లికానుక, బీసీలకు 50 సంవత్సరాలు నిండిన ప్రతి వ్యక్తికి పెన్షన్ ఇటువంటి ఎన్నో సంక్షేమ పథకాలు లభిస్తాయని తెలిపారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న ఐదు సంవత్సరాల కాలం ప్రతి కుటుంబానికి పెద్ద కొడుకు లాగా కుటుంబ భారాన్ని మోస్తాడని, అదే బాటలో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అడుగుజాడల్లో పయనిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు ఘంటసాల

ప్రజాశక్తి-మద్దిపాడు: సినీ గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు చిరస్మరణీయుడు అని కళాకారులు కె సుబ్బారావు, డి యలమంద అన్నారు. మండల కేంద్రమైన మద్దిపాడులోని శ్రీ నటరాజ కళా కేంద్రంలో బుధవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కటకం రామారావు, కలాం, సత్యనారాయణ, నరసింహారావు, కోటేశ్వరరావు, వెంకటేశ్వరరావు ఘంటసాల పాడిన పాటలను ఆలపించారు.

రేషన్ బియ్యం 'పక్కదారి'కి కారణమేంటి.?

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. మీడియాలో పెద్దఎత్తున ప్రచారం సాగింది. అసలు రేషన్‌బియ్యం ఎందుకు పక్కదారి పడుతున్నాయి? అనే కోణంలో పాలకులు ఆలోచించాలి. బయట మార్కెట్‌లో పాతిక కిలోల బస్తా రూ.1500కు పైగా ధర పెట్టి ఎందుకు కొనుక్కోవాల్సి వచ్చిందనే కోణంలో ప్రభుత్వ పెద్దలు ఆలోచించాలి. మంత్రులు, ఎమ్మెల్యేలూ ఇదే ఆలోచన చేయాలి. లక్షలాది టన్నులు ఇతర రాష్ట్రాలకు, ఇతర దేశాలకు ఎందుకు పోతున్నాయన్నదే తేల్చాల్సి ఉంది. లోతుగా పరిశీలిస్తే ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా ఇచ్చే బియ్యం అంత నాణ్యంగా ఉండటం లేదనే విమర్శలూ ఉన్నాయి. దీనికి తోడు పాలకవర్గాల అండదండలు ఉన్న వారే డీలర్లుగా చెలామణి అవుతున్నారు. వీరి ద్వారా రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం సాగుతోంది. ఇందులో ప్రధాన వాటా అధికారపార్టీ నేతల జేబుల్లోకే వెళుతోంది.

రేషన్‌బియ్యం పథకం ఆరంభం నుంచే పక్కదారి పట్టడం జరుగుతోంది. గతంలో గుజరాత్ నుంచి సేకరించి ఏళ్ల తరబడి పొడి మందు కలిపి నిల్వచేసేవాళ్లు. ఆ బియ్యం అసలు వాసనతో ఇంటికి కూడా తీసుకుపోయే పరిస్థితి ఉండేది కాదు. ఇప్పుడు రాష్ట్రంలోనే సేకరించిన బియ్యాన్ని ఇస్తున్నారు. అయితే తక్కువ కాలంలో పండిన పంటలను రైతులు సివిల్‌సప్లయి శాఖకు ఇస్తారు. మిల్లర్లు కూడా ఇదే చేస్తారు. రేషన్‌బియ్యం కోసమే తక్కువ కాలం పంటలు పండించే ప్రాంతాలు కూడా ఉన్నాయి. ఇక్కడే పేదలకు ఆహారభద్రతకు ముప్పు వస్తోంది. నాణ్యమైన రకం బియ్యాన్ని అంటే రోజు ఏ బియ్యం తింటున్నారో వాటిని ఇవ్వడం లేదు. గతంలో సన్నబియ్యంపై చర్చ సాగింది. అప్పటి సివిల్‌సప్లయిమంత్రి సన్నబియ్యం ఇస్తామన్నారని, ఇవ్వలేదని తెలుగుదేశం నేతలు విమర్శలు చేశారు. వాటిపై అప్పటి పాలకపక్షానికి, ప్రతిపక్షానికి మధ్య రగడ కూడా నడిచింది. ఇప్పటికీ అదే బియ్యం ఇస్తున్నారు. ఇదే రేషన్ బియ్యం పక్కదారి పట్టడానికి ప్రధాన కారణమవుతోంది. ఇప్పుడు నియోజకవర్గస్థాయిలో కూటమి నేతలే సేకరించి ఒక వ్యాపారికి అప్పగిస్తున్నారు. అందుకు గానూ రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షలు వరకూ నేతలకు ఆ వ్యాపారి ఇవ్వాల్సి ఉంది. ఇదంతా గుట్టుగా సాగుతోంది. ఆ బియ్యాన్ని వ్యాపారులు మిల్లులకు తరలించి పాలిష్‌వేయడం, ఇతర రాష్ట్రాలకు తరలించడం చేస్తున్నారు. పేదల కన్నా వ్యాపారులు, నాయకులు బాగుపడుతున్నారు. పోర్టుల ద్వారా పేద దేశాలకు తరలిస్తున్నారు. ఆఫ్రికా దేశాలకు పంపి కిలో రూ.70 దాకా సొమ్ము చేసుకుంటున్నారనే చర్చ సాగుతోంది. రేషన్‌బియ్యం పక్కదారి పట్టకుండా ఉండాలంటే బియ్యం నాణ్యమైనవి పంపిణీ చేయాలి. డీలర్ల వ్యవస్థలో రాజకీయ జోక్యం లేకుండా చూడాలి.

జిల్లాలో 6,59,576 మంది పేదలకు రేషన్‌కార్డులున్నాయి. ఒక్కొక్కరికి ఐదు కిలోల బియ్యం ఇస్తారు. ఈ లెక్కన జిల్లాలో 9,236 మెట్రిక్‌టన్నుల బియ్యం కేటాయిస్తున్నారు. ఇందులో మూడొంతుల బియ్యం పక్కదారి పడుతున్నాయి. ఎక్కువమంది ఇళ్లల్లో ఏ బియ్యం తింటున్నారో వాటినే అందిస్తే రేషన్‌బియ్యం పక్కదారి పట్టే అవకాశాలు తగ్గుతాయి. దీని వల్ల పేదల ఆహారభద్రతకు ముప్పు ఉండదని గుర్తించాలి.

ప్రజాశక్తి
గురువారం 5 డిసెంబర్ 2024

ఆటోను ఢీకొన్న లారీ

8 మంది కూలీలకు గాయాలు

ఇద్దరి పరిస్థితి విషమం

ప్రైవేటు వైద్యశాలకు తరలింపు



తీవ్రంగా గాయపడిన జ్యోతి, సుమలత

ప్రజాశక్తి - చీరాల

రొయ్యల ఫ్యాక్టరీలో కూలీ పనికి వెళ్లి పని ముగించుకొని తిరిగి ఇంటికి వెళుతున్న కూలీల ఆటోను ఎదురుగా అతివేగంతో ప్రయాణిస్తున్న లారీ ఢీకొట్టడంతో ఎనిమిది మందికి గాయాలు కాగా అందులో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ సంఘటన చిన్నగంజాం మండలం జాతీయ రహదారిపై సోపిరాల వంతెన వద్ద బుధవారం రాత్రి జరిగింది. అందిన వివరాల మేరకు.. చిన్నగంజాం మండలానికి చెందిన పలువురు మహిళలు వేటపాలెం మండలంలో రొయ్యల కంపెనీలో కూలీలుగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అయితే యథావిధిగా బుధవారం సాయంత్రం కంపెనీలో పనులు ముగించుకొని తిరిగి చిన్నగంజాం వెళ్లేందుకు ఆటోలో ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో చిన్నగంజాం జాతీయ రహదారిపై సోపిరాల సమీపంలోని వంతెన వద్ద ఒంగోలు వైపు నుంచి అతివేగంతో ప్రయాణిస్తున్న లారీ ఆటోను ఢీకొట్టడంతో కూలీలు అందరూ రోడ్డుపై చెల్లా చెదురుగా పడిపోయారు. అయితే లారీ డ్రైవర్ మాత్రం లారీని ఆపకుండా వేగంతో చీరాల వైపు పరారయ్యాడు. స్థానికులు 108కు సమాచారం అందించడంతో సిబ్బంది క్షతగాత్రులను చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న కూలిలలో సుమలత, జ్యోతిలకు తీవ్ర గాయాలు కాగా మరో మహిళ మస్తానీకు ఎడమ చెయ్యి పూర్తిగా తెగి రోడ్డుపై పడిపోయింది. వీరిని మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ వైద్యశాలకు బంధువులు తరలించారు. ఆటో డ్రైవర్‌తో పాటు ప్రసన్న, పలువురుకు స్వల్ప గాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న చిన్నగంజాం ఎస్ఐ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పరారీలో ఉన్న లారీని గుర్తించి వివరాలు సేకరిస్తున్నారు.



వైద్యశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు



ప్రమాదానికి గురైన ఆటో

ఎస్మా ప్రయోగం దుర్మార్గం

సిఐటియు బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి మజుందార్

ప్రజాశక్తి-బాపట్ల

104 సర్వీస్‌లో ఆరు నెలల పాటు సమ్మెను నిషేధిస్తున్నట్టు ప్రకటించి ఎస్మా ప్రయోగించటాన్ని సిఐటియు బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ మజుందార్ బుధవారం ఒక ప్రకటనలో ఖండించారు. 104 ఉద్యోగులు అనేక రోజులుగా తమ సమస్యల పరిష్కారానికి రాజకీయ నాయకులు, ప్రభుత్వ అధికారుల చుట్టూ తిరిగినా సమస్య పరిష్కారానికి కృషి చేయకుండా ఎస్మా ప్రయోగించడం ఉద్యోగుల హక్కులను కాలరాయటమేనన్నారు. వెంటనే 104పై ఎస్మాను ఉపసంహరించుకోవాలన్నారు. ఉద్యోగులతో చర్చలు జరిపి వారి సమస్యలు పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల యొక్క పోరాటానికి సిఐటియు ఎప్పుడు మద్దతు ఉంటుందని తెలిపారు.

జూదరులు అరెస్టు

ప్రజాశక్తి-వేటపాలెం

మండల పరిధిలోని దేశాయిపేట శివారు గ్రామంలో పేకాట ఆడతున్న 11 మంది జూదరులను బుధవారం ఎస్ఐ మీసాల వెంకటేశ్వర్లు అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి రూ.7,250 స్వాధీనం చేసుకున్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిరంతరం పోలీసుల నిఘా ఉంటుందని ఆయన హెచ్చరించారు.



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

గుండెపోటుతో వీఆర్వో అజీజ్ మృతి

ప్రజాశక్తి-చెరుకుపల్లి



అజీజ్ (ఫైల్)

బలుసులపాలెం గ్రామ వీఆర్వో అబ్దుల్ అజీజ్ బుధవారం గుండె పోటుతో మృతి చెందారు. దశాబ్ద కాలంగా చెరుకుపల్లి మండలంలో విధులు నిర్వహిస్తూ అందరికీ సుపరిచితమైన అజీజ్ మృతి చెందడం పట్ల అధికారులు, సహచరులు, గ్రామస్తులు ఆయన మృతికి సంతాపం ప్రకటించారు. గతంలో గుల్లపల్లి, ఆరేపల్లి గ్రామాల వీఆర్వోగా విధులు నిర్వహించి ఇటీవల బదిలీలలో భాగంగా బలుసుల పాలెం వచ్చారు. ఆయన మృతదేహాన్ని తహశీల్దార్ సిహెచ్ పద్మావతి, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మౌనిక, వీఆర్వోలు, సిబ్బంది సందర్శించి నివాళులు అర్పించారు. గ్రామ సర్పంచ్ కొనకాల నాగమల్లేశ్వరి వీఆర్వో మృతి పట్ల సంతాపాన్ని ప్రకటించారు.

హెల్త్ వెల్నెస్ సెంటర్‌ను మార్చొద్దు

అధికారులకు కొండమంజులూరు గ్రామస్తుల వినతి

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలోని కొండమంజులూరు గ్రామంలో ఆయుష్మాన్ భారత్ హెల్త్ వెల్నెస్ సెంటర్‌ను మార్చొద్దని కొండమంజులూరు గ్రామస్తులు కోరారు. అన్ని సౌకర్యాలతో ఉన్న హెల్త్ వెల్నెస్ సెంటర్లోనే ఆరోగ్య కేంద్రాన్ని కొనసాగించాలని డిఎంఅండ్‌హెచ్‌వోకు వినతిపత్రం అందజేశారు. కొండమంజులూరు గ్రామంలో సర్వే నెంబర్ 104లో సుమారు ఐదు సెంట్లు విస్తీర్ణంలో ఆయుష్మాన్ భారత్ హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌ను నిర్మించారు. సుమారు రూ.20 లక్షలతో అన్ని సౌకర్యాలతో నిర్మించిన ఈ సెంటర్లోనే గత రెండు సంవత్సరాల నుంచి గ్రామస్తులకు వైద్య సేవలు అందిస్తున్నారు. అయితే బుధవారం అందులోని సామాగ్రిని అంగన్‌వాడీ కేంద్రంలోకి మారుస్తున్నారని ఇరుకుగా ఉండే ఆ భవనంలోకి మార్చడం వలన ప్రజలు ఇబ్బంది పడతారని గ్రామస్తులు తెలిపారు. అధికారులు విషయాన్ని పరిశీలించి, వెల్నెస్ సెంటర్‌లోనే ప్రభుత్వ వైద్యశాలను కొనసాగించాలని కోరుతున్నారు.



కొండమంజులూరులోని వెల్‌నెస్ సెంటర్

విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-బాపట్ల

పట్టణంలో విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా గురువారం ఉదయం ఏడు గంటల నుంచి పది గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పట్టణ విద్యుత్ ఏఈ బి.సాయి శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.



రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

కంప్యూటర్ విద్యతో ఉపాధి అవకాశాలు

ప్రజాశక్తి-వేటపాలెం

కంప్యూటర్ విద్యతో ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని బండ్ల బాపయ్య విద్యాసంస్థల అధ్యక్షులు బండ్ల అంకయ్య అన్నారు. బుధవారం ఆయన స్థానిక బిబిహెచ్ జూనియర్ కళాశాలలో చెన్నైకి చెందిన కోకో ట్రైనింగ్ ప్లేస్మెంట్ కన్సల్టెన్సీ కళాశాల ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహిస్తున్న జాబ్ ఓరియంటెడ్ ట్రైనింగ్ సర్టిఫికెట్ ప్రోగ్రాంను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్తమాన కాలంలో అకౌంట్స్‌కు సంబంధించిన సాఫ్ట్వేర్ కోర్సులతోపాటు కామర్స్‌కు చెందిన కోర్సులను ప్రతి ఒక్కరు నేర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రెసిడెంట్ కోడూరి ఏకాంబరేశ్వర బాబు, సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ చల్లా వాసుదేవరావు, జాయింట్ సెక్రెటరీ బండ్ల రవీంద్రనాథ్, బీబీహెచ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.ఆదిలక్ష్మి, జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ జి.గంగాధర్, పూర్వపు ప్రిన్సిపాల్ సత్రం మల్లేశ్వరరావు, అంబేద్కర్ యూనివర్సిటీ రిటైర్డ్ వైస్ చాన్సలర్ పి.విజయబాబు తదితరులు పాల్గొన్నారు.



ట్రైనింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

నాటు సారా స్థావరాలపై దాడులు

ప్రజాశక్తి - చీరాల

నాటుసారా స్థావరాలపై ఎక్సైజ్ శాఖ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీహరి తన సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. ఈపురుపాలెంకు చెందిన కనక రమేష్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి మొత్తం 3 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ చట్ట ప్రకారం నాటు సారా కలిగి ఉండుట, రవాణా చేయటం, అమ్మటం నేరమన్నారు. అలాంటి వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

6న అంబేద్కర్ వర్ధంతి

సోషల్ వెల్ఫేర్ డిడి లక్ష్మా నాయక్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 68వ వర్ధంతి కార్యక్రమం ఈనెల 6న ఒంగోలులో నిర్వహిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఎస్.లక్ష్మా నాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఒంగోలు హెచ్‌సిఎం కళాశాల ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహానికి, కలెక్టరేట్ ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహానికి కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని అధికారులు, దళిత నాయకులు, హాజరు కావాలని ఆయన కోరారు.

బోదకాలు గుర్తింపునకు సర్వే

ప్రజాశక్తి - పంగులూరు.

పంగులూరులో నైట్ బ్లడ్ సర్వే నిర్వహిస్తున్నట్లు పంగులూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్ హరిబాబు తెలిపారు. బోదకాలు, సంబంధిత వ్యాధులకు చెందిన సర్వేను జిల్లా వైద్యాధికారి సూచనలు మేరకు రాత్రి వేళల్లో సర్వే చేస్తున్నామని ఆయన తెలిపారు. మండలంలోని పంగులూరు, కొండమూరు గ్రామాల్లో రక్త నమూనాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సతీష్ కుమార్, ఎంఎల్‌హెచ్‌పిలు పావని, బిందు, ఏఎన్ఎం ఎస్తేరు రాణి, ఆశా కార్యకర్తలు లక్ష్మీరాజ్యం, సంపూర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో ఎమ్మెల్యే తాటిపర్తి తనిఖీ

ప్రజాశక్తి-పుల్లలచెరువు

మండలంలోని నాయుడుపాలెం ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలను యర్రగొండపాలెం వైసిపి ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ బుధవారం తనిఖీ చేశారు. పాఠశాలలో మురికినీరు ప్రవహిస్తుందని ఆ మురుగును తొలగించాలని ఎమ్మెల్యే తాటిపర్తి ఉపాధ్యాయులను ఆదేశించారు. పాఠశాల పరిసరాలను, తరగతి గదులను పరిశీలించారు. పాఠశాలను పరిశుభ్రవాతావరణంలో ఉంచాలని ఆదేశించారు. పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ఆవుల కోటిరెడ్డి, ఎల్లారెడ్డి రోసిరెడ్డి, కుందూరు ఉమామహేశ్వర రెడ్డి, దోమకాలు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి

టిడిపి కార్యకర్త వీరయ్యకు సంతాపం

ప్రజాశక్తి-వేటపాలెం

టిడిపి కార్యకర్త కొమ్ము వీరయ్య గుండెపోటుతో బుధవారం ఉదయం మృతి చెందగా పలువురు నాయకులు సంతాపం తెలియజేశారు. విషయం తెలుసుకున్న చీరాల ఎమ్మెల్యే ఎంఎ కొండయ్య కుటుంబ సభ్యులను ఫోన్లో పరామర్శించారు. పలువురు నాయకులు పార్థివ దేహాన్ని సందర్శించి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. టిడిపి నాయకులు నాతాని ఉమామహేశ్వరరావు, షేక్ యాసిన్, కొత్తవరపు జనార్ధన్, షేక్ మొహద్దీన్, లాలా అహ్మద్, షేక్ సుభాని తదితరులు భౌతికకాయాన్ని సందర్శించిన వారిలో ఉన్నారు.

మాజీ సీఎం రోశయ్యకు నివాళి

ప్రజాశక్తి-వేటపాలెం

మాజీ సీఎం, తమిళనాడు మాజీ గవర్నర్ డాక్టర్ కొణిజేటి రోశయ్య తృతీయ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వేటపాలెం పట్టభద్రుల సంఘం అధ్యక్షులు, ఆర్యవైశ్య ప్రముఖులు ప్రత్తి వెంకట సుబ్బారావు, మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర విశ్రాంతి ఉద్యోగుల గౌరవ అధ్యక్షులు శివప్రసాద రావు, ఆర్యవైశ్య పెద్దలు ఊటుకూరు శ్రీమన్నారాయణ, మాజీ ఉపసర్పంచి పొన్నూరు శ్రీనివాసగుప్త,స్టేట్స్ ఎస్సీ సెల్ అధ్యక్షులు బెంజిమెన్, మాల మహానాడు నాయకులు సాల్మన్, రెడ్డి సంఘం యువ నాయకులు సుధాకర్ రెడ్డి, ముస్లిం మైనార్టీ నాయకులు ఖాదర్, వేటపాలెం మహిళా నాయకులు భువనేశ్వరి, కాలం సుబ్బులు, సీతారావమ్మ, పద్మ, కరిమూన్, వైశ్య విద్యార్థి అధ్యక్షులు పొన్నూరు రమేష్ కుమార్, కాకతీయ సేవా సంఘం జిల్లా యువ నాయకులు కరణం మురళీకృష్ణ, పాకనాటి రెడ్డి సేవాసమితి నాయకులు శ్రీనివాస రెడ్డి, వాసవి క్లబ్బుల నాయకులు ప్రతి సుబ్బారావు సన్నాఫ్ రామచంద్రరావు, పూల శ్రీనివాసరావు, మస్తాన్ రెడ్డి, రోటరీ క్లబ్ కార్యదర్శి ఊట్కూరి లక్ష్మణస్వామి, తదితరులు పాల్గొని ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటసుబ్బారావు మాట్లాడుతూ చీరాల నియోజకవర్గ అభివృద్ధికి రోశయ్య చేసిన సేవలు చెరగని ముద్ర వేశాయన్నారు.



మాజీ సీఎం రోశయ్యకు నివాళులర్పిస్తున్న నాయకులు

నాయకులు అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి



ప్రజాశక్తి-బాపట్ల

బాపట్ల నియోజకవర్గ అభివృద్ధిపై నాయకులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఆయన నివాస గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాను రాజకీయాల్లోకి ప్రవేశించాక గ్రామాలు పట్టణాల అభివృద్ధిపైనే ప్రధానంగా దృష్టి పెట్టానన్నారు. తాను ఎమ్మెల్యేగా ఐదుసార్లు గెలిచి మంత్రిగా రెండుసార్లు పనిచేసిన సమయంలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి తప్ప నేటి వరకు గ్రామీణ ప్రాంతాలు గాని బాపట్ల పట్టణంలో జరిగిన అభివృద్ధి కానీ చాలా తక్కువగా ఉందన్నారు. ప్రస్తుతం బాపట్ల రూరల్ గ్రామాలు మంచినీటి వసతి లేక ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. ఇసుక అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీకి కూడా తెలిపానన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇసుక అక్రమ తవ్వకాలపై నియంత్రణ చేయలేదన్నారు. మెడికల్ కాలేజీ పనులు పూర్తిగా నిలిపి వేశారన్నారు. ఈ సమావేశంలో గోవతోటి విజయ్, జిట్టా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రుణాలు చెల్లించని వారిపై చర్యలు

స్త్రీ నిధి మేనేజర్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-పంగులూరు

స్త్రీనిధి రుణాలు తీసుకొని, సకాలంలో చెల్లించని వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని స్త్రీ నిధి మేనేజర్ టేక్కం శ్రీనివాస రావు అన్నారు. బుధవారం పంగులూరులోని వెలుగు కార్యాలయంలో జరిగిన వీవోఏల రివ్యూ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. స్త్రీనిధి రుణాలు విరివిగా తీసుకోవాలని అయితే సకాలంలో రుణాలు చెల్లించాలని ఆయన కోరారు. స్త్రీ నిధి రుణాల ద్వారా మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించాలన్నారు. కుటుంబాలను అభివృద్ధి పథంలో నడుపుకునేందుకు ఈ రుణాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. డిఎంజి భాస్కర్ మాట్లాడుతూ మొబైల్ బుక్ కీపింగ్, గ్రేడింగ్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సీసీలు సాల్మన్, సురేష్, చంద్ర, అకౌంటెంట్ భాస్కరమ్మ పాల్గొన్నారు.



నూతనంగా ఎన్నికైన పంగులూరు మండల వీవోఏ కార్యవర్గం

వీవోఏల నూతన కార్యవర్గం ఎన్నిక

పంగులూరు మండల వీవోఏల నూతన కార్యవర్గాన్ని బుధవారం వెలుగు కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీవోఏల సంఘం నూతన అధ్యక్షురాలుగా తోకచిచ్చు చిన్న, ఉపాధ్యక్షురాలుగా బొగ్గవరపు కల్పన, కార్యదర్శిగా మేక నాగ మణి, సహాయ కార్యదర్శిగా బాచిన మనోరంజని, కోశాధికారిగా నాదెండ్ల లక్ష్మీ తిరుపతమ్మలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-బాపట్ల

బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం బుధవారం పట్టణంలోని ఓ ప్రైవేటు విడిది గృహంలో నిర్వహించారు. 1973-76 ఏడాది బీకాం విద్యార్థుల మూడో సమావేశంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. నాడు విద్య నేర్పిన గురువులు వి.వెంకట సుబ్బారావు, కొంపల్లి శేష తల్ప సాయిని సత్కరించారు. రాష్ట్ర నలుమూలల నుంచి సుమారు 40 మంది పూర్వ విద్యార్థులు ఈ సమావేశానికి హాజరయ్యారు. నూనూగు మీసాలతో కాలేజీని వదిలి తాతలుగా కలిసిన పూర్వ విద్యార్థులు ఒకరిని ఒకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఆనందంగా గతస్మృతులను నెమరు వేసుకుంటూ కుటుంబంతో సహా ఆనందంగా గడిపారు. తమకు చదువు చెప్పిన గురువులను ఘనంగా సత్కరించారు. 48 ఏళ్ల క్రితం విడిపోయి వివిధ వృత్తులను చేపట్టి పదవీ విరమణ పొందిన వారందరూ తమ వయసును మరిచిపోయి కళాశాలకు వెళ్లి గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వి.చంద్రశేఖర్, భుజగేంద్ర మౌళి, శ్రీహరి, రాఘవరావు, ఎస్.బి.మౌళి, మనోహర్, ఆంజనేయ వరప్రసాద్, వేణుగోపాల్ పాల్గొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

'ఘంటసాల'కు ఘన నివాళి

ప్రజాశక్తి-అద్దంకి

అద్దంకి రోటరీ క్లబ్ అఫ్ సింగరకొండ ఆధ్వర్యంలో ప్రముఖ గాయకుడు పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరావు 102వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని మునిసిపల్ కార్యాలయం వద్ద ఘంటసాల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ దేవపాలన మాట్లాడుతూ ఘంటసాల అమర గాయకుడని, ఆయన సినీ గీతాలే కాకుండా అయన వ్యాఖ్యనంతో పాడి ఆలపించిన భగవద్గీత తెలుగు వారి ప్రతీ ఇంట్లో ప్రతి రోజూ మనం వింటామని పేర్కొన్నారు. జ్యోతి చంద్రమౌళి మాట్లాడుతూ ఘంటసాల సినిమా గాయకుడే కాదు, స్వాతంత్ర్య పోరాటంలో కూడా పాల్గొన్న చరిత్ర ఉందన్నారు. ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర ఆవిర్భావ పోరాటంలో ఆనాడు పొట్టి శ్రీరాములుకి మద్దతు తెలిపారని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఐక్య వేదిక అధ్యక్షులు జ్యోతి రమేష్ మాట్లాడుతూ ఘంటసాల వంటి గాయకుడు మన తెలుగు వాడు కావటం మన అదృష్టమన్నారు. రోటరీ ఆధ్వర్యంలో అద్దంకిలో తర తమ బేధం లేకుండా అన్ని వర్గాల వారికి సేవాకార్యక్రమాలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య, కార్యదర్శి చుండూరి మురళీ సుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, పూర్వ అధ్యక్షులు సందిరెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న దృశ్యం

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - నగరం

ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో నిర్వహించిన సౌత్ వెస్ట్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో యూనివర్సిటీ నేషనల్ కళాశాల విద్యార్థి ఎ.అరుణేష ప్రతిభ చూపారు. 297 కిలోల బరువు ఎత్తి తృతీయ స్థానం సాధించాడు. ఈ సందర్భంగా కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ వల్లభనేని బుచ్చయ్య చౌదరి విద్యార్థిని అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అనగాని హరికృష్ణ మాట్లాడుతూ యూనివర్సిటీలో జరిగిన నేషనల్ గేమ్స్ లో తృతీయ బహుమతి పొందడం అభినందయకమని విద్యార్థిని అభినందించారు ఈ కార్యక్రమంలో కళాశాల ఎకడమిక్ డైరెక్టర్ వి.వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్ పి.అమరేష్ రెడ్డి, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ వి.సాంబమూర్తి, కళాశాల సిబ్బంది అభినందనలు తెలియజేశారు.



తృతీయ స్థానం సాధించిన అరుణేశ్



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

రోడ్ల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలి

ప్రజాశక్తి-వేమూరు

ఆర్అండ్‌బి అధికారులతో బుధవారం మాజీమంత్రి, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తన క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి అంచనాలు సిద్ధం చేయాలన్నారు. అలాగే నివేదికల అనంతరం పనులు పూర్తి చేయడానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బి డీఈ, ఏఈ పాల్గొన్నారు.

వీఆర్వోల సంఘం నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - పంగులూరు

పంగులూరు మండలం వీఆర్వోల సంఘం నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా అంబరపు బాబయ్య, ఉపాధ్యక్షుడిగా జంద్రాజు పల్లి వెంకటేశ్వర్లు, సెక్రెటరీగా గుమ్మడి నాగు, కోశాధికారిగా ఉదయగిరి సుమతిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం తహాశీల్దార్ సింగారావును కలిశారు.

మెగా ఫుడ్ పార్కుల నిర్మాణంపై ఎంపీ మాగుంట ప్రశ్న

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

దేశంలో, ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిపాదించిన మెగాఫుడ్ పార్కుల నిర్మాణం కేటాయించిన, వాడిన నిధులు, పార్కుల పెంపుదలపై ప్రస్తుత పార్లమెంట్ సమావేశాలలో ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు కేంద్ర ఆహార, పరిశ్రమల శాఖ సహాయక మంత్రి రవ్ నీత్ సింగ్ సమాధానమిస్తూ మెగా ఫుడ్ పార్కుల ఏర్పాటుకు రాష్ట్రాలకు, ప్రైవేటు రంగ సంస్థలకు కేంద్రం ఆర్థిక సహాయం అందిస్తుందని తెలిపారు. ఈ సహాయంతో శీతల గిడ్డంగులు, ప్రాసెస్ యూనిట్లు, గిడ్డంగులు, రవాణా సౌకర్యాలు, నాణ్యత సౌకర్యాలు, ప్యాకింగ్ సౌకర్యాలు వంటివి ఏర్పాటు చేస్తారని తెలిపారు. దేశంలో మొత్తంలో 41 మెగాఫుడ్ పార్కుల ఏర్పాటుకు కేంద్రం ఆమోదించిందని, 2021 ఏప్రిల్ 1 నుంచి ఈ పథకం నిలిపివేయబడిందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 3 మెగా ఫుడ్ పార్కులను ఆమోదించగా, అందులో రూ.49.92 కోట్లతో చిత్తూరు జిల్లాలో నిర్మించిన పార్కు 78 లక్షల టన్నుల సామర్థ్యంతో, రూ.44.53 కోట్లతో పశ్చిమ గోదావరి జిల్లాలో నిర్మించిన పార్కు 21 లక్షల టన్నుల సామర్థ్యంతో పనిచేస్తున్నాయన్నారు. కృష్ణా జిల్లాలో రూ.37.69 కోట్లతో మెగాఫుడ్ పార్క్ నిర్మిస్తున్నట్లు కేంద్ర మంత్రి తెలియజేశారు.

'యువ ఉత్సవ్-2024'ను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-నగరం

నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో శ్రీ వెలగపూడి రామకృష్ణ స్మారక కళాశాల ప్రాంగణంలో 6వతేది శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి యువ ఉత్సవ్ - 2024 కార్యక్రమం నిర్వహించబడుతుందని, స్థానిక యువత సద్వినియోగం చేసుకోవాలని కళాశాల కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ వల్లభనేని బుచ్చయ్య చౌదరి అన్నారు. ఈ కార్యక్రమం విద్యార్థులలోని సృజనాత్మకత మరియు నైపుణ్యాలను పెంపొందించడానికి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ పోటీ కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయన్నారు. సైన్స్ మేళా (వ్యక్తిగతం, గ్రూప్) యంగ్ రైటర్స్ పోటీ, యంగ్ ఆర్టిస్ట్ పోటీ, ఫోటోగ్రఫీ, కాంటెస్ట్ ఆఫ్ షాప్ ఫెస్టివల్ గ్రూప్ ఈవెంట్ జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ వి.వెంకటేశ్వర రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ అనగాని హరికృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలపై సర్వే

ప్రజాశక్తి-అద్దంకి

పాఠశాల విద్యార్థుల సామర్థ్యాలు తెలుసుకోవడానికి బుధవారం అద్దంకి మండలంలోని 13 పాఠశాలలో సర్వే నిర్వహించారు. మొత్తం 360 మంది విద్యార్థులకు 350 మంది విద్యార్థులు హాజరయ్యారు. 13 పాఠశాలలో ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్‌లు మరియు పరిశీలకులు సర్వే నిర్వహించారు. మండల విద్యాశాఖధికారి బి.సుధాకర్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జగన్‌తో బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వెంకాయమ్మ

జగన్‌ను కలిసిన 'బూచేపల్లి'

ప్రజాశక్తి-దర్శి

విజయవాడలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని ప్రకాశం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి శాసనసభ్యులు, ప్రకాశం జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు.



తనిఖీ చేస్తున్న అందె పవన్ కుమార్

'పిఎంఎవై' గృహాల ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

గిద్దలూరు మండలం ఓబుళాపురం గ్రామపరిధిలో 2016-17 పిఎంఎవై గ్రామీన్ పథకంలో మంజూరయిన గృహాలను బుధవారం గృహ నిర్మాణ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అందె పవన్ కుమార్ క్షేత్రస్థాయి తనిఖీ చేశారు. ఎన్‌పిఐ పథకంలో పురోగతిలో ఉన్న ఇళ్లను సందర్శించి లబ్ధిదారులతో నిర్మాణ పనులను గురించి చర్చించారు. గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసుకోవాలని, నిర్మాణాలకు అవసరమయ్యే మెటీరియల్ అందుబాటులో ఉన్నదని తెలుపుతూ 2024 డిసెంబర్‌కు పూర్తి చేయాలని, అటు తరువాత సదరు గృహాలకు బిల్లులు విడుదల కావని, కావున ఈ10 రోజుల్లో పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ తనిఖీలో గిద్దలూరు సబ్ డివిజన్ ఉపకార్యనిర్వాహక ఇంజనీర్ షేక్ ఖదీర్ బాషా, మండల సహాయక ఇంజనీర్ మహేశ్వరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నేలవాలిన పంటలు

- ఎడతెరిపి లేని వర్షంతో నీటమునిగిన మినుము
- దెబ్బతిన్న శనగ, వరి

ప్రజాశక్తి- సిఎస్.పురం

మండలంలో గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రబీ సీజన్లో రైతులు సాగు చేసుకున్న మినుము, శనగ పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. పంట చేతికొచ్చే సమయంలో వర్ష ప్రభావం వల్ల పంట పొలాల్లోకి నీరు చేరి మినుము పంట మునిగిపోయింది. మండలంలోని పెదగోగులపల్లి, వెంగనగుంట, ఆర్‌కె పల్లి, కె అగ్రహారం గ్రామాల్లో మినుము పంటను రైతులు అత్యధికంగా సాగు చేశారు. ఆయా గ్రామాల్లో 400 హెక్టార్లలో పంటను వేశారు. కంభంపాడు, చింతపూడి, నాగులవరం, కోమటిగుంట్ల గ్రామాల్లో 35హెక్టార్లలో సెనగ పంట సాగు చేశారు. మినుము పంట ప్రస్తుతం పూత, కాయ దశలో ఉన్నది. వర్షం ఎక్కువగా కురవడం వల్ల మినుము పంట సాగు చేసిన పొలాల్లో నీరు నిలువ ఉండటంతో పంట పూర్తిగా దెబ్బతింది. పంట మొత్తం పూత రాలిపోయి, కాయలు కుళ్లిపోయే దశలో ఉన్నాయని, పంట సాగు చేసిన రైతులు వాపోయారు. పెద్దగోగులపల్లి గ్రామంలో అధిక మొత్తంలో ఈ పంటను సాగు చేసి ఉన్నారు. ఒక ఎకరానికి రూ.15 వేల వరకు పెట్టుబడి పెట్టినట్లు రైతులు తెలిపారు. పంట చేతికందే సమయంలో వర్షం వల్ల పంట మునిగిపోయిందని తెలిపారు. 20 రోజుల క్రితం సెనగ పంట సాగు చేసిన రైతుల పరిస్థితి కూడా దయనీయంగా మారింది. పంట పొలాల్లో నీరు చేరడంతో పూర్తిగా దెబ్బతినిపోయింది. దెబ్బతిన్న పంట పొలాలను ఎఒ సంపత్‌కుమార్ బుధవారం పరిశీలించారు. నష్టపోయిన రైతులను ఆదుకుంటామని తెలిపారు. కె అగ్రహారం గ్రామంలో వరి పంట కోత సమయంలో పూర్తిగా నేలకొరిగింది. గ్రామానికి చెందిన గోనుగుంట్ల రమణయ్య, ఎడవల్లి రమణయ్యలు సాగు చేసిన వరి పంట పూర్తిగా నేలకొరిగింది. ఇంకా రెండు రోజులు ఇలాగే వర్షం కొనసాగితే వరి పంట మొలకలు వచ్చే పరిస్థితి ఏర్పడుతుందని వారు తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని కోరారు.

రైతుల పట్ల ఇంత నిర్లక్ష్యమా.?

యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

రైతాంగం పట్ల కూటమి ప్రభుత్వం అంతులేని నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ మండిపడ్డారు. బుధవారం యర్రగొండపాలెం పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు సర్కారు అలసత్వం కారణంగా రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారన్నారు. అన్నదాతలను ఆదుకుంటామంటూ గద్దెనెక్కిన సీఎం చంద్రబాబు నేడు పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు.



ఎమ్మెల్యే తాటిపర్తి

జిల్లా రైతులకు గతేడాది నుంచి ఇన్సూరెన్స్ అందలేదన్నారు. అతివష్టి, అనావష్టితో జిల్లా వ్యాప్తంగా రైతులు తీవ్రంగా నష్టపోయినా కేవలం కొన్ని మండలాలనే కరువు మండలాలుగా ప్రకటించి తీరని ద్రోహం చేశారన్నారు. మిరప, వేరుశనగ, కంది, సజ్జ పంట రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో కష్టాలే మిగులుతున్నాయన్నారు. కంది పంట దిగుబడులు తగ్గిపోతున్నా వ్యవసాయాధికారులు చర్యలు తీసుకోవడం లేదని చెప్పారు. మద్దతు ధర దక్కక రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అన్నదాత సుఖీభవ పథకం ప్రవేశపెట్టి రైతులకు రూ.20 వేలు ఇస్తామంటూ ఎన్నికల ముందు చెప్పిన చంద్రబాబు సీఎంగా బాధ్యతలు చేపట్టాక మాట తప్పారన్నారు.

అధికారంలోకి వచ్చిన తరువాత ఐదేళ్ల వరకు విద్యుత్ చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చిన చంద్రబాబు దానిని తుంగలో తొక్కి మొదటి దశలో యూనిటు రూ.1.27 చొప్పున అదనంగా ఛార్జీలు పెంచారన్నారు. 2025 జనవరి నుంచి సెకండ్ ఫేజ్‌లో యూనిట్‌కు రూ.2.17 చొప్పున పెంచనున్నారని తెలిపారు. దీనివల్ల ప్రజలపై రూ.87,500 కోట్ల భారం పడనుందని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ. 67 వేల కోట్లు అప్పులు చేసిందన్నారు. వీటిని ఏ పథకాలకు ఖర్చు చేశారో తెలపాలని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎంపిపి దొంతా కిరణ్ గౌడ్, జడ్పిటిసి చేదూరి విజయభాస్కర్, సర్పంచ్ రామావత్ అరుణాబాయి పాల్గొన్నారు.

భ్రమల్లో బతుకుతున్న జగన్

మంత్రి స్వామి



ప్రజాశక్తి-టంగుటూరు

మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి భ్రమల్లో బతుకుతున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వం ఫీజు బకాయిలు పెట్టి విద్యార్థులను ఇబ్బంది పెట్టిందన్నారు. వైసీపీ హయాంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించలేదని కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులను పరీక్షలు రాయనివ్వలేదని చెప్పారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాము చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు.

ఆ అర్హత జగన్‌కి లేదు..

అవినీతి, కమీషన్లలో అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్ర పరువు తీసిన వ్యక్తి జగన్ అని, కమీషన్ల గురించి జగన్ మాట్లాడుతుంటే వైసీపీ కార్యకర్తలే నవ్వుకుంటున్నారని మంత్రి స్వామి అన్నారు. దళితుల గురించి మాట్లాడే అర్హత వైసీపీ నాయకులకు లేదన్నారు. దళిత శాసనసభ్యులపైనే జగన్ దాడి చేయించాడన్నారు. వైసీపీ పాలనలో దళితులకు శిరోముండనం చేశారని, దళితుడైన డ్రైవర్ సుబ్రమణ్యంను చంపి డోర్ డెలివరీ చేశారని, అలాంటిది ఇప్పుడు దళితుల గురించి మాట్లాడితే ప్రజలు నమ్మే పరిస్థితి లేదని చెప్పారు. జగన్మోహన్‌రెడ్డి ఇప్పటికైనా వాస్తవాలు గ్రహించాలని, భ్రమలో ఉంటే పూర్తిగా పతనం అవుతారని హితవు పలికారు.



మురళీకృష్ణకు శుభాకాంక్షలు తెలుపుతున్న కమిటీ సభ్యులు

కళాకారుల సమస్యల పరిష్కారానికి కృషి

సంఘం గౌరవాధ్యక్షులు మండవ మురళీకృష్ణ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

కళాకారుల సమస్యల పరిష్కారానికి తన వంతు కషి చేస్తానని ది ప్రకాశం జిల్లా సకల వత్తి కళారంగ ఐక్యత సంఘం గౌరవ అధ్యక్షులు మండవ మురళీకృష్ణ తెలిపారు. ది ప్రకాశం జిల్లా సకల వత్తి కళారంగా ఐక్యత సంఘం నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. ఈ కమిటీలో వ్యాపారవేత్త, సూర్యశ్రీ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ మండవ మురళీకష్ణనిసంస్థ గౌరవ అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షులు కొమ్ము విజయకుమార్, ప్రధాన కార్యదర్శి గుంటి సురేష్, కోశాధికారి అంకిరెడ్డి రామ్ సాయి, ఉపాధ్యక్షులు ఎస్‌కే షాహిన్, ఆరిగ సురేష్, సహ కార్యదర్శులు మనోహర్, జిలానీ పాల్గొన్నారు.

మున్సిపల్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-గిద్దలూరు

గుంటూరు రీజినల్ పరిధిలోని మున్సిపల్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఆంధ్రప్రదేశ్ మునిసిపల్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సభ్యులు గుంటూరు రీజినల్ డైరెక్టర్ హరికృష్ణకు బుధవారం కోరారు. ఆంధ్రప్రదేశ్ మునిసిపల్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షులు కృష్ణమోహన ఆదేశాల మేరకు గుంటూరు రీజినల్ డైరెక్టర్ హరికృష్ణను కలిసిన అసోసియేషన్ మహిళా కార్యదర్శి వై కోటేశ్వరమ్మ, వైస్ ప్రెసిడెంట్ షేక్ టపా ఖాదర్ వలి మాట్లాడుతూ గుంటూరు రీజియన్‌లోని సిబ్బంది యొక్క సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. స్పందించిన రీజినల్ డైరెక్టర్ హరికృష్ణ మాట్లాడుతూ సదరు పదోన్నతులు జనవరి మొదటి వారంలో పూర్తి చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. రీజినల్ డైరెక్టర్‌ను కలిసినవారిలో ఆర్గనైజింగ్ సెక్రటరీ కె చెంచయ్య, జాయింట్ సెక్రెటరీ ఎం మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మంత్రి స్వామి జన్మదిన వేడుకలు



మంత్రి స్వామిని గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-శింగరాయకొండ


రాష్ట్ర సాంఘిక, సంక్షేమ, సచివాలయ, వాలంటీర్ల, వయోవద్ధుల శాఖల మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి పుట్టినరోజు వేడుకలు బుధవారం రాత్రి టంగుటూరు మండలం తూర్పు నాయుడుపాలెంలోని మంత్రి నివాసంలో ఘనంగా నిర్వహించారు. మంత్రి స్వామి బుధవారం ఉదయం తిరుమలలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శనం పూర్తి చేసుకొని బుధవారం రాత్రికి తూర్పు నాయుడుపాలెం చేరుకున్నారు. అక్కడకు తెలుగుదేశం పార్టీ నాయకులతో పాటు కొండపి నియోజకవర్గంలో నుంచి భారీగా నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యి శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లావ్యాప్తంగా అధికార యంత్రాంగం మంత్రికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు దామచర్ల పూర్ణచంద్రరావు మంత్రి నివాసానికి వచ్చి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఏపీ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

టంగుటూరులో..

టంగుటూరు: మంత్రి బాల వీరాంజనేయ స్వామి జన్మదిన వేడుకలు టంగుటూరులో కోలాహలంగా జరిగాయి. బుధవారం సాయంత్రం ఒంగోలు తూర్పు నాయుడుపాలెంలోని తన నివాసంలో కార్యకర్తలు, నాయకులు మధ్య మంత్రి తన పుట్టినరోజు వేడుకలు జరుపుకున్నారు. మండలంలోని జయవరం గ్రామంలో మంత్రి బాల వీరాంజనేయ స్వామి జన్మదిన వేడుకలు గ్రామ



మంత్రికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు



మంత్రికి శుభాకాంక్షలు తెలుపుతున్న దామచర్ల పూర్ణచంద్రరావు

తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు యరమోసు సుధాకర్‌బాబు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. కొణిజేడు గ్రామానికి చెందిన టిడిపి తెలుగు యవత రాష్ట్ర అధికార ప్రతినిధి రామా గోపి మంత్రికి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం ఇచ్చి.. కేక్ కట్ చేయించారు. వేడుకలలో నాయకులు ఈదర ప్రభాకర్, కాకుమాని శ్రీకాంత్, దామచర్ల బసవయ్య కందులూరు, ఏలూరి రాంబాబు పాల్గొన్నారు.

కొండపి: మంత్రి స్వామి జన్మదిన వేడుకల సందర్భంగా ఆయనను కొండపి మండల టిడిపి నాయకులు శాలువాలతో, పుష్పమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఏయంసి చైర్మన్ జి.రామయ్యచౌదరి, టిడిపి మండల అధ్యక్షులు బొడ్డపాటి యలమందనాయుడు, బత్తుల నారాయణస్వామి, నరసారెడ్డి, వసంతరావు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థలో మార్పు కోసం 'చదువుల పండుగ'

ప్రజాశక్తి-మర్రిపూడి



ఎంఇఒ ఇవి రంగయ్య

మండలంలోని 54 ప్రభుత్వ పాఠశాలల్లో విద్య వ్యవస్థలో మార్పు కోసం రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టినున్న చదువుల పండుగ కార్యక్రమాలు ఈనెల 7నుండి ప్రారంభం కానున్నాయని ఎంఇఒ ఇవి రంగయ్య తెలిపారు. 41 ఎంపీపీ ఎస్ పాఠశాలలు, 7యుపి, 6 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలు బలోపేతానికి, విద్య వికాసానికి, సమస్యలు పరిష్కారానికి ఇది దిక్సూచిగా నిలుస్తుందని వివరించారు. విద్యార్థినీ, విద్యార్థులు, తల్లిదండ్రుల మధ్య ఆత్మీయ వారిదిగా ఈ ప్రోగ్రాం నిలుస్తుందన్నారు. విద్యార్థుల భవిష్యత్తు ఉన్నత శిఖరాలకు చేరుకోవడమే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో వార్డు మెంబర్ నుండి పార్లమెంటు సభ్యుల వరకు, గ్రామ పంచాయతీ సర్పంచ్ నుండి ముఖ్యమంత్రి వరకు పాల్గొనే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతనికి అందరూ కషి చేయాలని కోరారు.



మధ్యాహ్న భోజనం చేస్తున్న ఎంఇఓ సుబ్బయ్య

మెనూ పాటించాలి

ప్రజాశక్తి-తాళ్లూరు

మధ్యాహ్న భోజన పథకంలో మెనూ తప్పక పాటించాలని ఎంఇఒ గురిజాల సుబ్బయ్య అన్నారు. మండలంలోని నాగంబోట్లపాలెం జెడ్పి హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన బుదవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు. ప్రతిరోజు ప్రభుత్వ నిబంధన మేరకు భోజనాన్ని రుచిగా చేయాలని చెప్పారు. ప్రతిరోజూ మెనూ ఇదేవిధంగా ఉండాలని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి అంజలికి సూచించారు. విద్యార్థులకు రుచికరమైన భోజనం పెట్టేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. పిల్లల చదువుల అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న పథకాలను సక్రమంగా అమలు చేయడం ద్వారా ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చాలని అన్నారు. అనంతరం పాఠశాలరికార్డులు కూడా పరిశీలించారు.



కేక్‌కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పాపారావు, కడియాల రమేష్

లలిత్‌సాగర్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-దర్శి

పట్టణంలోని కురిచేడు రోడ్‌లోని శ్రీసాయి వద్ధాశ్రమంలో తెలుగుదేశం యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్ జన్మదిన వేడుకలు తెలుగు తమ్ముళ్లు ఘనంగా నిర్వ హించారు. ముఖ్య అతిథులుగా కడియాల రమేష్, మాజీ శాసన సభ్యులు నారపుశెట్టి పాపారావు పాల్గొని కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని, ఉన్నత పదవులు అధిరోహించాలని కోరారు. ప్రజలకు అందుబాటు లో ఉండి మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని కోరారు. తదుపరి వద్ధాశ్రమంలోని వద్ధులకు అన్నదానం చేసి దుప్పట్లు పంపిణీ చేశారు. వివిద హెూదాల్లో ఉన్న సీనియర్ టిడిపి నాయకులు, జనసేన, బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

విపత్తులను ఎదుర్కొనేలా సిద్ధంగా ఉండాలి

కలెక్టర్లతో వీక్షణ సమావేశంలో రాష్ట్ర హెూం మంత్రి వంగలపూడి అనిత

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

విపత్తులను సమర్థంగా ఎదుర్కొనేలా ప్రభుత్వ యంత్రాంగం ఎల్లవేళలా సర్వసన్నద్ధంగా ఉండాలని హెూం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత కోరారు. కలెక్టర్లు, ఎస్పీలతో ఆమె బుధవారం వీక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదలు, నదులకు వరద ముంపు తదితర విపత్తుల సమయంలో ప్రాణ నష్టం, పశు నష్టం జరగకుండా చూడటం అత్యంత ప్రాధాన్యమని స్పష్టం చేశారు. ఇందుకోసం ముందస్తు జాగ్రత్తలు, సహాయక చర్యలు పకడ్బందీగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. డ్రోన్లు వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా సమర్థంగా వినియోగించుకోవాల్సి ఉంటుందన్నారు. సచివాలయ సిబ్బంది ద్వారా స్థానిక నీటి వనరులపై శిథిలావస్థలో ఉన్న చప్టాలను, లో లెవెల్ బ్రిడ్జిలను గుర్తించి వాటి పునర్నిర్మాణానికి అవసరమైన అంచనాలను ప్రభుత్వానికి పంపించాలని చెప్పారు. నీటి ముంపుకు గురి అయ్యే ఇళ్ళు, పంట పొలాలను గుర్తించి వాటి వివరాల కోసం యాప్ తయారు చేసి అందులో నమోదు చేయాలన్నారు. గ్రామస్థాయిలో ఆపద మిత్ర కింద నాలుగు లేక ఐదుగురిని ఏర్పాటు చేసుకొని వారికి ఐడి కార్డులు ఇవ్వాలన్నారు. జిల్లా స్థాయిలో ఎస్డిఆర్ఎఫ్, ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలను బలోపేతం చేయాలన్నారు.



హెూమ్ మంత్రి అనిత కలెక్టర్లతో సమావేశంలో కలెక్టర్ వెంకట మురళి, జెసి ప్రఖర్ జైన్

విపత్తు నివారణ కమిటీల పనితీరును గమనించాలన్నారు. తుఫాను ప్రభావిత ప్రాంతాలకు ఖర్చు చేయడానికి ముందుగా నిధులను సర్దుబాటు చేసుకోవాలన్నారు. అగ్నిమాపక శాఖ, ఇరిగేషన్, ఆర్ అండ్ బి శాఖల సిబ్బంది, అధికారులు లోటు పాట్లను గమనించి ప్రతిపాదన పంపాలని అన్నారు. విపత్తులను ఎదుర్కోవటానికి అవసరమైన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఓపి) ముసాయిదాను అన్ని జిల్లాలకు పంపుతామని, వాటిని పరిశీలించి అవసరమైన సూచనలు, సలహాలు ఇవ్వాలని చెప్పారు. విపత్తుల సమయంలో ఉపయోగపడేలా గతంలో ఎంపిక చేసిన స్థానికులకు అవసరమైతే మరోసారి శిక్షణ ఇచ్చే విషయం పరిశీలిస్తామన్నారు. గత అనుభవాలను, డేటాను, స్థానిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని ఎలాంటి పరిస్థితి తలెత్తినా సమర్థంగా ఎదుర్కొనేలా సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ జె వెంకట మురళి మాట్లాడుతూ బాపట్ల జిల్లాలో 30లంక గ్రామాలు ఉన్నాయని తెలిపారు. ఆ గ్రామాలలో 30వేల జనాభా నివాసం ఉంటున్నారని తెలిపారు. ఇటీవల వచ్చిన వరదల కారణంగా ప్రజలు నాలుగు రోజులు పాటు నీళ్లలోనే ఉన్నారని చెప్పారు. 9వేల మందిని బయటకు తీసుకు వచ్చామని చెప్పారు. మిగిలిన వారికి బోట్లు ద్వారా భోజనం, మందులు, నీళ్లు అందించామని తెలిపారు. బోట్లు ఎక్కువ లేకపోవడం వలన ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. అందుకు బోట్లను సమకూర్చాలని కోరారు. లంక గ్రామాల ప్రజలు పశువులను వదిలి పునరావాస కేంద్రాలకు రావడానికి ఆసక్తి చూపటం లేదన్నారు. అందుకుగాను జిల్లాలో ఒక గ్రామంలో సిఎస్ఆర్ నిధుల కింద 2000 చదరపు అడుగులలో భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అందుకు సుమారు రూ.50లక్షలు ఖర్చు అవుతుందని తెలిపారు. లంక గ్రామాల్లో రోడ్లు సరిగా లేవని, వాటిని సరి చేయించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లింపు చేయాలని కోరుతూ మంత్రి వంగలపూడి అనితకు వివరించారు. సమావేశంలో సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి జి గంగాధర్‌గౌడ్, అగ్నిమాపక, విపత్తు నివారణ అధికారి మాధవనాయుడు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన చేస్తాం

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ వినోద్

ప్రజాశక్తి-దర్శి

సమస్యల సుడిగుండంలో దర్శి ఎస్సీ కాలేజీ హాస్టల్ ఉంది. 60మంది విద్యార్థులకు 2 మరుగుదొడ్లు, వాటికి కూడా తలుపులు లేవు. త్రాగటానికి బోరింగు నీల్లె దిక్కు. అపరిశుభ్రంగా వున్న పరిసరాలతో విద్యార్థులు రోగాల బారిన పడుతున్నారు. ఒక్క వర్కర్‌తో పని సాగడం లేదు. సమయానికి భోజనం పెట్టడం లేదు. విద్యార్థులే సొంత డబ్బులతో ఫ్యాన్‌లు ఏర్పాటు చేసుకున్నారు. తెగి వేలాడు తున్న కరెంటు తీగలు దర్శనమిస్తున్నాయి. సమస్యలు వెంటనే పరిష్కారం చేయకుంటే ఆందోళనా చేపడతామని ఎస్ఎఫ్ఐ కార్యదర్శి పేర్కొన్నారు. పట్టణంలోని ఎస్సీ కాలేజీ హాస్టల్‌ను బుధవారం పరిశీలించారు. విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను నాయకుల దష్టికి తీసుకువచ్చారు. ఏ అధికారి వచ్చిన పట్టించుకోవడం లేదని, తమను చిన్నచూపు చూస్తున్నారని అన్నారు. పలుమార్లు అధికారుల దష్టికి తీసుకువెళ్లినా రెండు, మూడు రోజులు బాగుంటుంది. తర్వాత యథాస్థితి పరిస్థితి కొనసాగుతుందన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ వినోద్ మాట్లాడుతూ సంవత్సరం నుండి అద్దె భవనాలకు ప్రభుత్వం అద్దె చెల్లించడం లేదని అన్నారు. దీంతో అద్దె భవనాలు సౌకర్యాలు లేకుండా కొనసాగుతున్నాయని అన్నారు. సరిపడా సిబ్బంది లేని కారణంగా హాస్టళ్ల నిర్వహణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కె విజయ్ మాట్లాడుతూ దర్శి హాస్టల్ సమస్యపై జిల్లా అధికారులు స్పందించి తక్షణమే పరిశీలన చేసి, పరిష్కారం చేయాలని కోరారు. లేకుంటే విద్యార్థులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ దర్శి నాయకులు రంగారావు, నాగేశ్వరావు ఉన్నారు.



విద్యార్థుల సమస్యలు పరిశీలిస్తున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వినోద్

రెవెన్యూ సదస్సులు నిర్వహించేలా చర్యలు

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

రెవిన్యూ సదస్సులు డిసెంబర్ 6నుంచి జనవరి 8వరకు నిర్వహిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. రాష్ట్ర రాజధాని నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో బుధవారం ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. జిల్లా నుంచి కలెక్టర్ జె వెంకట మురళి హాజరయ్యారు. ప్రతి రెవిన్యూ గ్రామంలో సదస్సులు జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి చెప్పారు. సదస్సులపై ప్రజలకు విస్తృతమైన అవగాహన కల్పించాలన్నారు. ఈ సదస్సుల ద్వారా ప్రజల సమస్యలకు పూర్తిగా పరిష్కారం దొరకాలన్నారు. గ్రామాల వారీగా తహశీల్దార్లు షెడ్యూల్ ప్రకటించుకోవాలని అన్నారు. రీసర్వే పూర్తికాని రెవెన్యూ గ్రామాల్లో ముందస్తుగా సదస్సులు నిర్వహించడానికి ప్రణాళికలు రూపొందించామని కలెక్టర్ జె వెంకట మురళి రెవెన్యూ శాఖ మంత్రి, సీసీఎల్ఏ ప్రిన్సిపల్ సెక్రెటరీ దష్టికి తీసుకువెళ్లారు. జిల్లాలో 277 రెవెన్యూ గ్రామాలు ఉండగా 71 గ్రామాలలో రీ సర్వే పూర్తయిందన్నారు. మిగిలిన 206 గ్రామాలలో రీసర్వే జరుగుతోందన్నారు. రీసర్వేపై నిర్వహించిన గ్రామ సభలలో 4,230 అర్జీలు ప్రజల నుంచి వచ్చాయన్నారు. అందులో 1,009 అర్జీలు కేవలం రెవెన్యూకి సంబంధించినవేనన్నారు. వీటిలో 40శాతం అర్జీలను పూర్తిస్థాయిలో పరిష్కరించామని అన్నారు. మిగిలినవి సర్వేకు సంబంధించిన ఫిర్యాదులేనన్నారు. రెవెన్యూ సదస్సుల నిర్వహణకు పక్కా ప్రణాళికతో ముందుకు వెళు తున్నామని కలెక్టర్ వివరించారు. సమావేశంలో సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, బాపట్ల ఆర్డీఒ పి గ్లోరియా పాల్గొన్నారు.



రెవిన్యూ మంత్రి సత్యప్రసాద్ వీక్షణ సమావేశంలో కలెక్టర్ జెవి మురళి, జెసి ప్రఖర్ జైన్



చెకుముకి చందా అందజేస్తున్న దృశ్యం

బాలికలకు ఉచితంగా సైన్స్‌పత్రికలు

ప్రజాశక్తి - పీసీపల్లి

చెకుముకి మాసపత్రికలకు సంవత్సర చందా చెల్లించినట్లు జెవివి సీనియర్ నాయకులు వి మాలకొండారెడ్డి తెలిపారు. కనిగిరి పట్టణంలోని ప్రముఖ చిన్న పిల్లల వైద్యులు స్వర్గీయ డాక్టర్ సిహెచ్ గురుబ్రహ్మం పేరు మీద నియోజకవర్గంలోని కనిగిరి, వెలిగండ్ల, హెచ్ఎం పాడు, పిసిపల్లి కెజిబివి విద్యా కేంద్రాలకు పది పత్రికలకు నగదు బుధవారం అందించినట్లు తెలిపారు. తండ్రి పేరు మీద ఈవిధంగా సైన్స్ పత్రికలను బాలికల కోసం ఉచితంగా అందించడం అభినంద నీయమని అన్నారు. పిసిపల్లి జెవివి నాయకులు ఎస్కెపిఎం గౌస్, నాయకులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

క్రీడాకారులకు ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి - చీరాల

సేవా కార్యక్రమాలలో వాకర్స్ అసోసియేషన్ తమ వంతు సహకారాన్ని అందిస్తుందని అసోసియేషన్ అధ్యక్షులు పోలుదాసు రామకృష్ణ అన్నారు. బుధవారం ఎన్ఆర్ అండ్ పిఎం హైస్కూల్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో 39వ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఒడిస్సాలోని భువనేశ్వర్, కళింగ స్టేడియంలో డిసెంబర్ 7 నుంచి 11వరకు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆ పోటీలకు ఎంపికై, డిసెంబర్ 5వ తేదీన భువనేశ్వర్ వెళ్ళనున్న వై.యశ్వంత్ రాజ్, పి.మహాలక్ష్మిలకు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు రూ.12,600 ఆర్థిక సాయాన్ని కోచ్ పులుగు ధనుంజయ శ్రీనివాసరెడ్డి సమక్షంలో అందజేసారు. ఈ సందర్భంగా అక్కడ జరిగే పోటీలలో లాంగ్ జంప్, పరుగు పందెంలో బాగా రాణించి, చీరాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ పోలుదాసు రామకృష్ణ, చారగుళ్ళ గురుప్రసాద్, గొడవర్తి సుధాకరరావు, వలివేటి మురళీకృష్ణ, తిరుపతిరావు, వీరాంజనేయులు, నారాయణమూర్తి, పూర్ణచంద్రరావు, రాముడు, సుబ్బారావు, నారాయణ, రమేష్, భాస్కరరావు, చెంగలరాయుడు, శ్రీనివాసరావు, వాకింగ్ సభ్యులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న టిడిపి నాయకులు



క్రీడాకారులకు ఆర్థిక సాయం అందజేస్తున్న వాకర్స్ అసోసియేన్ సభ్యులు

చీరాల: యువత విద్యతోపాటు క్రీడలను రాణించాలని విజయం సాధించే క్రీడాకారులను మరింతగా ప్రోత్సహించాలని టిడిపి నియోజకవర్గ అధికార ప్రతినిధి మహేంద్ర నాథ్ తెలిపారు. బుధవారం స్థానిక టిడిపి కార్యాలయంలో నేషనల్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌కు ఎంపికైన చీరాల క్రీడాకారులకు పార్టీ నాయకులు కౌతవరపు జనార్ధన్ చేతుల మీదగా రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు భువనేశ్వర్ ఒడిస్సాలో జరగనున్న 39వ నేషనల్ క్రీడలలో పాల్గొనేందుకు ఎంపిక అయిన వి.యశ్వంత్ రాజు, మరియు వైకుంటపురంకు చెందిన పి.మహాలక్ష్మిలను అభినందించారు. అదేవిధంగా వారికి నిరంతరం శిక్షణ అందిస్తూ విజయం సాధిస్తున్న కోచ్ శ్రీనివాస్ రెడ్డికి అభినందనలు తెలిపారు. జరగనున్న క్రీడలలో మరింత విజయం సాధించి చీరాల ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

6 నుంచి రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి-సంతమాగులూరు : మండలంలో 6వ తేదీ నుంచి గ్రామ సచివాలయాల వారీగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ కె.రవిబాబు తెలిపారు. 6న కామేపల్లి, 7న వెల్లలచెరువు, 10న అడవిపాలెం, 11న కొమ్మాలపాడు, 12న మక్కెనవారిపాలెం, 13న ఏల్చూరు, 17న సంతమాగులూరు, 18న పాతమాగులూరు, పుట్టావారి పాలెం, 19న మిన్నేకల్లు, 20న తంగేడుమల్లి, 21న చవిటిపాలెం, 26న గురిజేపల్లి, 27న కొప్పరం, 28న పత్తేపురం, బండివారిపాలెం, 31న సజ్జాపురం, జనవరి 2న కుందుర్రు, 3న మామిళ్ళపల్లి, 4న పరిటాలవారిపాలెం, 5న గోపాపురంలో సభలు నిర్వహించనున్నట్లు తహశీల్దార్ తెలిపారు. ఆయా గ్రామాలలో రెండు రోజులు ముందుగా దండోరా వేయించాలని సిబ్బందిని ఆదేశించారు.

మార్టూరు: మండలంలో 6వ తేదీ నుంచి గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహశీల్దార్ టి. ప్రశాంతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6న కోనంకి, చిమ్మిరిబండ, డిసెంబర్ 10న ఇసుక దర్శి, 13న బబ్బేపల్లి, రాజుగారి పాలెం, 17న నాగరాజుపల్లి, 19న రాజుపాలెం, దేగరమూడి, 21న లక్కవరం, 23న జంగమహేశ్వరపురం, 27న మార్టూరు, 30న జొన్నతాళి, జనవరి 2న వలపర్ల, 4న బొల్లాపల్లి, 6న కోలలపూడి, 8న ద్రోణాదుల గ్రామ సచివాలయాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహశీల్దార్ తెలిపారు.

యద్దనపూడి: మండలంలో ఈనెల 6వ తేదీన అనంతవరం, 10న యనమదల, 11న పోలూరు, 13న పూనూరు, 17న జాగార్లమూడి, 19న వింజనంపాడు, 20న గన్నవరం, 21న యద్దనపూడి గ్రామాల్లోని సచివాలయాల వద్ద గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ రవి కుమార్ తెలిపారు.

వేటపాలెం: మండలంలో 6వ తేదీ నుంచి జనవరి 8వ తేదీ వరకు జరగనున్న రెవెన్యూ సదస్సులను విజయవంతం చేయాలని మండల తహశీల్దార్ పి.పార్వతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అసంబద్ధ నిర్ణయాలు సరికాదు: యుటిఎఫ్

ప్రజాశక్తి-మార్కాపురం

విద్యాశాఖ అధికారుల అసంబద్ధ నిర్ణయాలకు వ్యతిరేకంగా మార్కాపురం, పెద్దారవీడు ఎంఈవోలకు యుటిఎఫ్ ప్రతినిధులు బుధవారం వినతిపత్రాలను అందజేశారు. అపార్‌తో ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. పెద్దారవీడులో ఎంఇఓ-2 సుబ్రమణ్యంకు, మార్కాపురంలో ఎంఇఓ-1 బి.రాందాస్‌నాయక్‌లకు వినతిపత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఒద్దుల వీరారెడ్డి, జిల్లా కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు, మండల అధ్యక్ష, కార్యదర్శులు పి.జయరామిరెడ్డి, వి.రాజేష్, సీనియర్ నాయకులు కె.వెంకటేశ్వరరెడ్డి, కె.వెంకటేశ్వర్లు, అల్లూరిరెడ్డి, పి.రమాదేవి, జి.రామకృష్ణ పాల్గొన్నారు.



ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

కొల్లూరు: యుటిఎఫ్ కొల్లూరు మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని ఉపాధ్యాయుల సమస్యలపై మండల విద్యాశాఖ అధికారి సౌభాగ్య జ్యోతికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బి.వినోద్ బాబు, మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్ రాజేష్, డేవిడ్ లివింగ్ స్టన్, సీనియర్ ఉపాధ్యాయులు కె.వి.శ్రీనివాసరావు, వెంకటచలం, పరిశుద్ధుడు, రవికుమార్, నరసింహారావు, కోటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

పంటల బీమాపై అవగాహన అవసరం

'పొలం పిలుస్తోంది'లో ఏడీఏ విజయబాబు

ప్రజాశక్తి-రేపల్లె

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకంపై రైతులు అవగాహన కలిగి ఉండాలని రేపల్లె సహాయ వ్యవసాయ సంచాలకులు ఆర్.విజయబాబు అన్నారు. మండలంలో కారుమూరు, మోర్లవారిపాలెం గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీమా చేయించుకోవడం వల్ల ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోయిన రైతులకు ఆర్థిక భరోసా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు సయ్యద్ అక్తర్ హుస్సేన్ పాల్గొన్నారు.

మార్టూరు: రబీలో సాగు చేస్తున్న పంటల నమోదు కార్యక్రమం గ్రామాలలో జరుగుతుందని వరి, మొక్కజొన్న, శనగ, పొగాకు పంటలు సాగు చేస్తున్న రైతులు రైతు సేవా కేంద్రాల సిబ్బందిని కలిసి నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి వి.కిరణ్ కుమార్ తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని బొల్లాపల్లి గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. బీమా యోజన పథకం కింద ఇన్సూరెన్స్ నమోదు చేసుకోవడానికి డిసెంబరు 15వ తేదీ చివరి అవకాశం అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్ర సిబ్బంది చైతన్య, రైతులు పాల్గొన్నారు.



పర్చూరులో రైతులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

పర్చూరు: శనగ పంటలో తెగుళ్లను సమర్థవంతంగా అరికట్టాలని ఏడీఏ మోహనరావు అన్నారు. బుధవారం పర్చూరు మండలంలోని అన్నంబోట్లవారపాలెం, తన్నీరువారి పాలెం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ రైతులు శనగ పంటలో వచ్చు ఎందుతెగులు, వేరుకుళ్ళు తెగులు మరియు కుంకుమ తెగులు నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ పంటలకు ఈ నెల 15లోపు రైతులు ప్రీమియం చెల్లించాలన్నారు.

అద్దంకి: ఉద్యాన పంటల సాగుతో అధిక ఆదాయం పొందవచ్చని ఉద్యాన శాఖ అధికారిణి ఎస్.దీప్తి తెలిపారు. మండలంలోని నాగులపాడు, వేలమూరిపాడు గ్రామాలలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. కూరగాయలు సాగు చేసిన రైతులకు ఎకరాకు రూ.8 వేలు, పూలు సాగు చేసిన రైతులకు ఎకరాకు రూ.6,200 ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు అనూష, తదితరులు పాల్గొన్నారు.

మేదరమెట్ల: మండలంలోని ప్రసంగలపాడు, కనగాలవారిపాలెం గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ కె.ధనరాజ్, ఎంఏఓ పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యద్దనపూడి: మండలంలోని పోలూరు, శ్యామలవారిపాలెం గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి మేరిమ్మ, పశువైద్యాధికారి శారద పాల్గొన్నారు.

చీరాల: మండలంలోని బుర్లవారిపాలెం, పిట్టువారిపాలెం, విజయలక్ష్మి పురం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు మొక్కజొన్న పంటను సందర్శించారు. ఈ కార్యక్రమంలో విఏఏ హదాషా, శ్రావ్య, జెడ్‌బిఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గోకులం షెడ్ల నిర్మాణం పూర్తి చేయాలి

ప్రజాశక్తి - పర్చూరు

చీరాల నియోజకవర్గం పరిధిలో మంజూరైన గోకులం షెడ్ల నిర్మాణాలు త్వరితగతన పూర్తి చేయాలని బాపట్ల జిల్లా సీనియర్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ పి.శాంతారావు అన్నారు. బుధవారం పర్చూరులోని ఏపీవో కార్యాలయ సమావేశ మందిరంలో చీరాల, వేటపాలెం చిన్నగంజాం, పర్చూరు, కారంచేడు, ఇంకొల్లు మండలాల ఉపాధి హామీ సిబ్బందితో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. తక్కువ వ్యయంతో నాణ్యమైన షెడ్లను నిర్మించి లబ్ధిదారులకు అందజేయాలని తెలిపారు. నిర్మాణ కొలతలు, నాణ్యత గురించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పర్చూరు ఏపీవో బుల్లియ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు

టీడీపీ కార్యకర్తల సమావేశం

ప్రజాశక్తి-కొల్లూరు

కొల్లూరులోని ఎంప్లాయిస్ రిక్రియేషన్ క్లబ్‌లో బుధవారం జరిగిన టీడీపీ సమావేశంలో వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం దిశగా ముందుకు వెళ్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అహర్నిశలు కష్టండి రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. కొల్లూరు మండలంలో పార్టీ సభ్యత్వాలు భారీగా నమోదయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో కొల్లూరు మండల టీడీపీ అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, పార్టీ రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి డాక్టర్ కనగాల మధుసూధన ప్రసాద్ పాల్గొన్నారు.

ఎల్ఐసీ నూతన కార్యాలయంలో పూజలు

ప్రజాశక్తి-అద్దంకి

భారతీయ జీవిత బీమా సంస్థ నూతన కార్యాలయ భవనంలో పూజలు నిర్వహించారు. పట్టణంలోని మెయిన్ రోడ్డులో ఎల్ఐసీ కార్యాలయం ఏర్పాటు చేసి 33 సంవత్సరాలు పాత భవనంలో ప్రజలకు సేవలు అందించారు. నూతన కార్యాలయ భవనంలోకి అడుగిడే సందర్భంగా బంగాళా రోడ్డులోని చిన్ని శ్రీమన్నారాయణ బిల్డింగు మోర్ బిల్డింగ్‌పైకి ఈ కార్యాలయం మార్చేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. నూతన సంవత్సరం నుంచి అద్దంకి బ్రాంచ్ నూతన కార్యాలయంలో కార్యకలాపాలు ప్రారంభం అవుతాయని ఎల్ఐసి అద్దంకి బ్రాంచ్ ఎస్‌బిఎం, వి.మాధవ కృష్ణ తెలిపారు.



టీడీపీలో చేరిన వైసీపీకి చెందిన కుటుంబాలు

టీడీపీలో చేరిన దళిత కుటుంబాలు

ప్రజాశక్తి-టంగుటూరు

టంగుటూరు మండలం జయవరం గ్రామానికి చెందిన 20 దళిత కుటుంబాలు టీడీపి గ్రామ పార్టీ అధ్యక్షుడు యర్రమోసు సుధాకర్ బాబు ఆధ్వర్యంలో వైసీపీని వీడి మంత్రి సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మంత్రి డాక్టర్ స్వామి మాట్లాడుతూ వైసీపీ దళితులను మోసం చేసిందని, అందుకే ఆ పార్టీని వీడి రాష్ట్ర అభివృద్ధికి పాడుపడుతున్న టీడీపీలో చేరుతున్నారని తెలిపారు. టీడీపీ దళితులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మంత్రి చెప్పారు.

'వెలిగొండ' పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి

మంత్రి లోకేష్‌తో మార్కాపురం ఎమ్మెల్యే 'కందుల'


లోకేష్‌తో మాట్లాడుతున్న కందుల

ప్రజాశక్తి-మార్కాపురం

'పశ్చిమ ప్రకాశం' అభివృద్ధి 'పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు'తో ముడిపడి ఉందని, ప్రాజెక్టు నిర్మాణానికి నిధుల కొరత లేకుండా త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి విజ్ఞప్తి చేశారు. బుధవారం అమరావతిలో మంత్రి లోకేష్‌ను ఎమ్మెల్యే కందుల కలుసుకున్నారు. వెలిగొండ ప్రాజెక్టు, మార్కాపురం జిల్లా, ప్రభుత్వ మెడికల్ కళాశాలకు సహకరించాలన్నారు. తద్వారా మార్కాపురం ప్రాంత అభివృద్ధి చెందుతుందన్నారు. వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణంలో జాప్యం కారణంగా రైతాంగం ఏటా నష్టపోతోందన్నారు. మార్కాపురం ప్రత్యేక జిల్లా చేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చారని, ఆ హామీని త్వరగా నెరవేర్చాలని కోరారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణం కొనసాగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వీటితో పాటు మార్కాపురం నియోజకవర్గంలోని ప్రజా సమస్యలను మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లారు.


మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

రెవెన్యూ సదస్సుల నిర్వహణకు చర్యలు

మంత్రికి వివరించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలలో రెవెన్యూ సదస్సులు పటిష్టంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు కలెక్టర్ ఏ.తమీమ్‌అన్సారియా వివరించారు. బుధవారం ఉదయం రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్, అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఈ నెల 6 నుంచి జనవరి 8వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న రెవెన్యూ సదస్సుల ఏర్పాట్లపై తగిన సూచనలు. ఆదేశాలు జారీ చేశారు. ఒంగోలు కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా మాట్లాడుతూ జిల్లాలోని 826 రెవెన్యూ గ్రామాలల్లో 298 రెవెన్యూ గ్రామాల్లో రీ సర్వే పూర్తి అయ్యిందని తెలిపారు. భూ సమస్యలపై మొత్తం 8,889 అర్జీలు వచ్చాయని, అందులో 6,283 అర్జీలు సర్వే సంబంధిత అంశాలపై వచ్చినట్లు తెలిపారు. కనిగిరి డివిజన్ పరిధిలోని 4 మండలాల్లో ఎక్కువ అర్జీలు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. రెవెన్యూ సమస్యలు ఎక్కువగా ఉన్న గ్రామాల్లో రెండు రోజులు రెవెన్యూ సదస్సులు నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించినట్లు కలెక్టర్ తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ లో సంయుక్త కలెక్టర్ ఆర్. గోపాల క్రిష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి బి.చిన ఓబులేసు, కలెక్టరేట్ ల్యాండ్ సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.

విపత్తులు ఎదుర్కొనేందుకు సిద్ధంకండి

కలెక్టర్లకు హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత ఆదేశం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

విపత్తులను సమర్ధవంతంగా ఎదుర్కొనేలా ప్రభుత్వ యంత్రాంగం ఎల్లవేళలా సర్వసన్నద్ధంగా ఉండాలని రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. బుధవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రకాశం భవనం నుంచి కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియాతో పాటు సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకష్ణ, డిఆర్ఒ బి.చినఓబులేసు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. హెూం మంత్రి మాట్లాడుతూ విపత్తుల సమయంలో ప్రాణ నష్టం జరగకుండా చూడటం అత్యంత ప్రాధాన్యమని స్పష్టం చేశారు. ఇందు కోసం డ్రోన్లు వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా సమర్ధవంతంగా వినియోగించుకోవాల్సి ఉంటుందన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఒంగోలు ఆర్డీవో కె.లక్ష్మీ ప్రసన్న, డిపిఒ జి.వెంకట నాయుడు, సిపిఒ డి.వెంకటేశ్వర్లు, జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్ కె.బేబీ రాణి, ఇన్‌చార్జి డిఎం,హెచ్ఒ డాక్టర్ పద్మజ, జిల్లా మత్స్య శాఖ అధికారి ఏ. చంద్రశేఖర్ రెడ్డి, ఏపిసిపిడిసిఎల్ ఎస్ఇ కట్టా వెంకటేశ్వర్లు, పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్

రాష్ట్రస్థాయి కార్యక్రమం బాపట్లలోనే..

- హాజరుకానున్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- కలెక్టర్ జె.వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్‌లో హాజరయ్యేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 7న బాపట్లకు రానున్నారని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని న్యూవిసి హాల్లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి బాపట్ల జిల్లాలో ప్రారంభిస్తారని కలెక్టర్ చెప్పారు. ఈ కార్యక్రమాన్ని మొట్టమొదటిసారిగా బాపట్లలో నిర్వహించడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ప్రభుత్వ పాఠశాలలోనూ ఈ సమావేశాలు


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

జరుగుతాయన్నారు. ఒక్కొక్క ప్రజాప్రతినిధి ఒక్కొక్క పాఠశాలకు వెళ్లేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. బాపట్ల మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి వరకు విద్యనభ్యసించే విద్యార్థులు 919 మంది ఉన్నారన్నారు. కేవలం విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఎంపిక చేసిన పూర్వ విద్యార్థులు మాత్రమే ఈ కార్యక్రమానికి హాజరవుతారని స్పష్టం చేశారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటనలో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా హెలిప్యాడ్ వద్ద, బాపట్ల మున్సిపల్ ఉన్నత పాఠశాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఉంటుందన్నారు. బాపట్లలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు చోటు లేకుండా ముందస్తు భద్రతా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వం నుండి ఆహ్వాన పత్రాలు, పాసులు ఉన్నవారిని మాత్రమే సభా ప్రాంగణంలోకి అనుమతిస్తామన్నారు. ముఖ్యమంత్రి పర్యటనను జయప్రదం చేయాలని జిల్లా సమాచార, పౌర సంబంధాలశాఖ సహాయ సంచాలకులు కె సుభాషిణి కోరారు. సమావేశంలో బాపట్ల డిఎస్పి రామాంజనేయులు పాల్గొన్నారు.

అడిగేదెవరు..ఆపేదెవరు.?

- జిజిహెచ్‌లో సమయ పాలన పాటించని కొందరు వైద్యులు
- ఓపీలో ఉండేది సరాసరి 3 గంటలే..
- దూర ప్రాంతం నుంచి వచ్చే రోగులకు తప్పని తిప్పలు..



జనరల్ మెడిసిన్ విభాగంలో డాక్టర్ కోసం వేచి ఉన్న పేషెంట్లు, ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో ప్రభుత్వం నిర్వహించే అతి పెద్ద హాస్పిటల్ ఒంగోలులోని జిజిహెచ్ (ప్రభుత్వ సర్వజన వైద్యశాల). ఇక్కడికి నిత్యం 1000 మందికి పైనే రోగులు వివిధ ప్రాంతాల నుంచి వస్తుంటారు. జిల్లాలో ఏ చిన్న ప్రైవేటు హాస్పిటల్‌లో అయినా డాక్టర్లు 8 గంటలు ఓపీలు చూస్తున్నారు. కానీ జిజిహెచ్‌లో మాత్రం డాక్టర్లు సరాసరి ఓపీలు చూసే సమయం 3 గంటలు మించడం లేదు. సాధారణంగా వైద్యులు ఓపీలో 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అందుబాటులో ఉండాలి. మధ్యాహ్నం భోజనానికి ఒక గంట పోయినా ఆరు గంటలు ఓపీలు చూడాలి. కానీ ఇందులో సగం గంటలు మాత్రమే ఓపీలో ఉంటున్న పరిస్థితి. కానీ వీరిని అడిగేవాళ్లు..ఆపేవాళ్లు ఎవరూ లేకపోవడం గమనార్హం..

జిజిహెచ్‌కు నగరంతో పాటు జిల్లా నలుమూలల నుంచి పేషెంట్లు వస్తుంటారు. ఇక్కడ జనరల్ మెడిసిన్‌తో పాటు జనరల్ సర్జరీ, ఆర్థోపెడిక్, గైనకాలజీ, పిడియాట్రిక్, డెర్మటాలజీ, ఈఎన్‌టి, ఆప్తమాలజీ, డెంటల్‌తో పాటు న్యూరోసర్జరీ, కార్డియాలజీ తదితర సూపర్‌స్పెషాలిటీ వైద్యసేవలు కూడా అందుబాటులో ఉన్నాయి. ఇక్కడికి దూరప్రాంతాల నుంచి వచ్చే రోగులు ఉదయాన్నే వస్తేనే వైద్యులు అందుబాటులో ఉంటారు. 12.30 దాటితే మరుసటి రోజు రావాల్సిందే.. నూతన సూపరింటెండెంట్ వచ్చాక సాయంత్రం కూడా ఓపీలు చూడాలని వైద్యులకు చెప్పినా.. అది సరిగ్గా అమలు కావడం లేదు.

కలెక్టర్ తనిఖీలు చేస్తున్నా..

ఎక్కువగా పేదలు ఆధారపడ్డ ప్రభుత్వ వైద్యశాలలపై కలెక్టర్ తమీమ్‌అన్సారియా ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. జిల్లాలోని ప్రభుత్వ వైద్యశాలల్లో నిత్యం ఆకస్మిక తనిఖీలు కూడా చేస్తూ.. వైద్యులను అప్రమత్తం చేస్తున్నారు. జిజిహెచ్‌కు కూడా కలెక్టర్ రెండు సార్లు తనిఖీలకు వెళ్లారు. ఒకసారి మంత్రి స్వామి, ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌తో పాటు తనిఖీ చేయగా.. మరోసారి గైనకాలజీ, నవజాత శిశువుల విభాగాన్ని తనిఖీ చేశారు. జిజిహెచ్‌లో కొందరు వైద్యులు సమయపాలన పాటించటం లేదు. కలెక్టర్ తమీమ్‌అన్సారియా మార్కాపురంలోని ప్రభుత్వ వైద్యశాలను జులై 8న ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ వైద్యులు సమయపాలన పాటించకపోవడాన్ని గుర్తించారు. 'డ్యూటీలో ఉండే డాక్టర్ పేర్లు, ఫొటో ఉన్న చార్ట్ ఆసుపత్రిలో ఉండాలి. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ.. సమయపాలన పాటించని వైద్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం..' అని హెచ్చరించారు. దీంతో అక్కడ వైద్యుల పేర్లు, ఫొటోలతో చార్ట్ ఏర్పాటుచేశారు. కానీ జిజిహెచ్‌లో మాత్రం ఏ డాక్టర్ ఓపీలో ఉంటారో, ఏ డాక్టర్ ఓటీ (ఆపరేషన్ థియేటర్)లో ఉంటారో తెలియని పరిస్థితి. ఇక్కడ ఆ రోజు డ్యూటీలో ఉండే డాక్టర్ పేరు, ఫొటో చార్ట్ ఏర్పాటుచేయాలని పేషెంట్లు కోరుతున్నారు.

నర్సులకు తలనొప్పిగా..

కొందరు వైద్యులు ఓపీ రూములోకి సుమారు పది గంటలకు వస్తారు. 12.30 గంటల తర్వాత కనిపించరు. ఓపీతో వచ్చిన పేషెంట్లు డాక్టర్‌ను కలిశాక అవసరమైన వారు డాక్టర్ సూచనలతో టెస్టులకు వెళతారు. టెస్టు రిపోర్టులు వచ్చాక వాటిని తీసుకొని మధ్యాహ్నం సమయంలో డాక్టర్ రూము వద్దకు వెళితే అక్కడ డాక్టర్లు కనిపించరు. డాక్టర్లు ఎప్పుడొస్తారని అక్కడి నర్సులను పేషెంట్లు అడిగితే ఏం చెప్పలేని పరిస్థితి. కొందరు నర్సులు డాక్టర్ అరగంటలో వస్తారని చెప్పినా.. గంటయినా రానప్పుడు పేషెంట్లకు సమాధానం చెప్పలేని దుస్థితి. డాక్టర్ సాయంత్రం ఎప్పుడో వస్తారని, ఒక వేళ వచ్చినా ఓపీలోకి రాకపోవచ్చని నిజం చెబితే.. డాక్టర్లతో మాటలు పడాల్సిన పరిస్థితి. దీంతో డాక్టర్ల సమయపాలన వ్యవహారం నర్సులకూ తలనొప్పిగా మారింది.

బుధవారం మధ్యాహ్నం జనరల్ మెడిసిన్ విభాగం, ఇఎన్‌టి విభాగాలను 'ప్రజాశక్తి' పరిశీలించింది. జనరల్ మెడిసిన్ విభాగంలో ఒక్క జూనియర్ డాక్టర్ తప్ప ఇంకెవ్వరూ లేరు. ఇద్దరు పేషెంట్లు ఓపీ తీసుకొని వస్తే.. అక్కడి సిబ్బంది టైం అయిపోయిందని సమాధానమివ్వడంతో పేషెంట్లకు ఏం చేయాలో తెలియని పరిస్థితి. ఇఎన్‌టి విభాగంలోనూ ఒక్క డాక్టర్ కూడా కనిపించలేదు. అందరూ సమావేశానికి వెళ్లారని అక్కడి నర్సులు చెప్పటం గమనార్హం.


ఇఎన్‌టి విభాగంలో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

సాయంత్రం కూడా ఓపీ చూస్తున్నారు..

జిజిహెచ్ సూపరింటెండెంట్ జమున

వైద్యుల సమయపాలన విషయమై జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ జమునను వివరణ కోరగా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు డాక్టర్లు ఓపీలో అందుబాటులో ఉంటారని చెప్పారు. తాను వచ్చాక సాయంత్రం కూడా ఓపీలో డాక్టర్లు ఉండేలా చూస్తున్నట్లు తెలిపారు.